# అఫ్ఘాన్ పరిణామాలు.. అమెరికా వ్యూహం

**అఫ్ఘానిస్థాన్.. అంతర్యుద్ధ జ్వాలల్లో ముప్పై ఏళ్లుగా అట్టుడుకుతున్న దేశం. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో సోవియట్ యూనియన్, అమెరికా మధ్య ఆధిపత్య పోరులో.. ప్రస్తుతం తాలిబన్లు, అమెరికా సైనికుల మధ్య యుద్ధకాండలో వేల మంది అమాయకులు బలవుతున్నారు. 2001లో తాలిబన్ల పాలన అంతమై ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడినా.. నేటికీ శాంతియుత వాతావరణం నెలకొనలేదు. ఈ శతాబ్దపు తొలి దశకమంతా దేశ పాలనా పగ్గాలు చేపట్టిన హమీద్ కర్జాయ్ అమెరికా ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాడనే అపప్రథ పొందారు. మరోవైపు తాలిబన్లను అణచివేసి తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి, అఫ్ఘాన్‌లో సుస్థిర పాలన నెలకొల్పడానికి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా పట్టుదలగా ఉన్నారు.**

అఫ్ఘాన్.. అంతర్యుద్ధానికి తెరదించాలని ఒబామా ప్రకటించారు. ఈ క్రమంలో మరో 30 వేల అమెరికా దళాలను తరలించనున్నట్లు.. అంతర్యుద్ధాన్ని ముగించి 2011 జులై నుంచి దళాల ఉపసంహరణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అఫ్ఘాన్, పాక్ సరిహద్దులు అల్‌ఖైదా ఉగ్రవాదుల స్థావరాలుగా మారాయని.. పాకిస్థానీ తాలిబన్లు అణు సంపదను చేజిక్కించుకునేందుకు పాక్ అణుకేంద్రాలపై దృష్టిపెట్టారని ఆందోళన వ్యక్తంచేశారు. అమెరికా సైనిక బలగాలను పంపడానికి అదే కారణమన్నారు. అఫ్ఘాన్ ప్రభుత్వం కూడా పాలనలో పురోగతి చూపాలని, ప్రజలకు భద్రత కల్పించాలని సూచించారు. అప్పుడే అమెరికా సాయం అందుతుందని పేర్కొన్నారు. అదనపు బలగాలను పంపడంపై అమెరికాలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అఫ్ఘాన్‌ను మరో వియత్నాంగా మారుస్తున్నారనే విమర్శలను ఒబామా తోసిపుచ్చారు. కొత్త విధానంపై భారత ప్రధాని మన్మోహన్‌తో ఫోన్ ద్వారా ఒబామా చర్చలు జరపడం గమనార్హం.

### తాజా వ్యూహం:

అమెరికా తాజా వ్యూహం ప్రకారం ఆ దేశ సైనికులు పాక్ లోని ఉగ్రవాద శిబిరాలపైనా దాడులు చేస్తారు. ఇది సజావుగా సాగితే భారత్‌కు కూడా మేలే అనేది నిపుణుల అభిప్రాయం. ఈ కొత్త దళాలతో అఫ్ఘాన్‌లో అమెరికా దళాల సంఖ్య లక్షకు చేరుతుంది. నాటో కూడా మరో ఎనిమిది వేల మందిని నియమించనుంది. మరోవైపు అఫ్ఘాన్‌లో భారీగా చేపడుతున్న సహాయ, పునరావాస, అభివృద్ధి కార్యక్రమాలు ఆచరణలో విఫలమైనట్లు.. ఒబామా ప్రభుత్వంలో అఫ్ఘాన్ విషయాలను పరిశీలిస్తున్న సెనెటర్ క్లెయిర్ మెక్ కాస్కిల్ నేతృత్వంలోని ఉపసంఘం గణాంకాలతో వివరించింది. ఒబామా సరికొత్త వ్యూహంపైనే అఫ్ఘాన్ భవితవ్యం ఆధారపడిందనేది నిస్సందేహం. మరో వియత్నాంలా అమెరికాకు భంగపాటు ఎదురైతే మళ్లీ తాలిబన్లు, అల్‌ఖైదాలదే ఇష్టారాజ్యమవుతుంది. ఇప్పటికే తాలిబన్లు సీఐఏ ఏజెంట్లను లక్ష్యంగా చేసుకున్నారు. ఆత్మాహుతి దాడితో ఖోస్ట్ రాష్ట్రంలో ఏడుగురు సీఐఏ ఏజెంట్లను హతమార్చారు.

### అఫ్ఘాన్ ఎన్నికలు:

అఫ్ఘానిస్థాన్‌లో ఐదేళ్లకోసారి ప్రత్యక్ష పద్ధతిలో అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. పోలైన ఓట్లలో 50 శాతం దాటిన అభ్యర్థే విజేత. ఈ మేరకు 50 శాతం ఓట్లు ఎవరికీ రాకపోతే ఫలితాలు వెల్లడైన రెండు వారాల్లో.. తొలి రెండుస్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు మళ్లీ ఎన్నిక నిర్వహిస్తారు. ఈ క్రమంలో.. 2001 సెప్టెంబర్ దాడులకు కారణమైన ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికాకు అప్పగించడానికి తాలిబన్ ప్రభుత్వం నిరాకరించడం.. అమెరికా యుద్ధం ప్రకటించడం.. నాటో దాడులతో తాలిబన్ ప్రభుత్వం కూలిపోవడం వెంటవెంటనే జరిగాయి. దీంతో హమీద్ కర్జాయ్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. 2004లో తొలిసారిగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో కర్జాయ్ విజయం సాధించారు. నిబంధనల ప్రకారం.. 2009లో మళ్లీ ఎన్నికలు నిర్వహించారు.

### ముగ్గురి మధ్యనే ప్రధాన పోటీ:

2009 ఆగస్టు 20న జరిగిన ఎన్నికల్లో ఫ్రోజన్ ఫనా, షహ్లా అనే మహిళలు సహా 41మంది పోటీపడ్డారు. ప్రధాన పోటీ మాత్రం హమీద్ కర్జాయ్, డాక్టర్ అబ్దుల్లా అబ్దుల్లా, అష్రఫ్ ఘనీ అహ్మద్జాయ్ మధ్యనే. ఎవరికీ 50 శాతం ఓట్లు రాలేదు. దేశంలో కోటీ 70 లక్షల మంది ఓటర్లు ఉండగా, కేవలం 48, 23, 090 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 2,25, 363 ఓట్లు చెల్లనివే. మిగతా 45,97, 727 ఓట్లలో హమీద్ కర్జాయ్‌కు 49.67 శాతం,డాక్టర్ అబ్దుల్లా అబ్దుల్లాకు 30.59 శాతం వచ్చాయి. అయితే ఎన్నికల్లో అవకతవకలు జరిగినట్లు ఐక్యరాజ్యసమితి మద్దతు ఉన్న ఎన్నికల ఫిర్యాదుల కమిషన్ ధ్రువీకరించింది. ఒక్కొక్క ఓటుకు రూ.500 ఇచ్చినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఎన్నికల కమిషన్ నవంబరు 7న రెండో విడత ఎన్నికలు నిర్వహించింది. రెండో విడత ఎన్నికల సక్రమ నిర్వహణకు.. తానిచ్చిన సూచనల్ని ఎన్నికల కమిషన్ నిరాకరించిందనే కారణంతో అబ్దుల్లా అబ్దుల్లా పోటీ నుంచి తప్పుకున్నారు. దీంతో కర్జాయ్‌ను విజేతగా ఎన్నికల కమిషన్ చైర్మన్ అజీజుల్లా లోడిన్ ప్రకటించారు. రాజకీయ సుస్థిరత ఉంటేనే పునర్నిర్మాణ కార్యక్రమాలు సజావుగా సాగుతాయని భావించిన ఒబామా ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించారు.

### అఫ్ఘానిస్థాన్.. పూర్వాపరాలు:

ప్రపంచ దేశాలు.. ముఖ్యంగా అమెరికా దృష్టి అఫ్ఘానిస్థాన్ పై కేంద్రీకృతంకావడానికి ఆ దేశానికి ఉన్న భౌగోళిక, రాజకీయ వ్యూహాత్మక స్థానమే ప్రధాన కారణం. సుదీర్ఘ చరిత్రగల అఫ్ఘానిస్థాన్, భారత్‌లో ఐదోవంతు మాత్రమే ఉన్నా, ఆసియాలో కీలకస్థానంలో ఉంది. యూరప్, ఆసియాలకు వారధిగా, మధ్య ఆసియా ముస్లిం దేశాలకు ముఖద్వారంగా దీన్ని వ్యవహరిస్తారు. పశ్చిమాన ఇరాన్, ఆగ్నేయాన పాకిస్థాన్, ఉత్తరాన తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్, తజికిస్థాన్ ఈశాన్యాన చైనాలు దీనికి సరిహద్దు దేశాలు. ప్రపంచ రాజకీయాలను శాసించాలనుకునే అగ్ర రాజ్యాలన్నీ అఫ్ఘాన్‌పై పట్టునే కోరుకుంటున్నాయి. ఆ

దేశంలోని తెగల వైరాన్ని అడ్డుపెట్టుకుని తమ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

## చారిత్రక నేపథ్యం:

అఫ్ఘానిస్థాన్ అంటే అఫ్ఘాన్ ప్రజలు నివసించే నేల అని అర్థం. కాబూల్ ప్రాంతంలో నివసించే పస్థూన్ తెగ ప్రజలను మొగల్ చక్రవర్తి బాబర్ తన జీవిత చరిత్రలో అఫ్ఘాన్‌లుగా పేర్కొన్నారు. ఆ జాతి మీదనే అఫ్ఘానిస్థాన్ అనే పేరు స్థిరపడింది. దేశంలో వీరిదే అతిపెద్ద తెగ. డబ్ల్యు.కె.ఫ్రాజి యర్ టయలర్, ఎం.సి.గిల్లెట్, ఇతర చరిత్రకారుల పరిశోధనల ప్రకారం క్రీస్తుశకం 982 లో హుదుద్ అల్-ఆలమ్‌లో తొలిసారిగా అఫ్ఘాన్ అనే పదం ఉపయోగించారు. ఆధునిక అఫ్ఘానిస్థాన్ మొత్తానికి వర్తింపచేస్తూ 1857లో తొలిసారిగా ఫ్రెడరిక్ ఏంగిల్స్ ఈ పదాన్ని వాడారు. 1919లో అంతర్జాతీయ సమాజం అఫ్ఘానిస్థాన్ అనే పేరును గుర్తిం చింది.

## నిత్యం దండయాత్రలే:

తొలినాళ్ల నుంచి ఈ ప్రాంతం దండయాత్రలకు గురైంది. పర్షియన్ రాజులు, అలెగ్జాండర్, భారతీయ రాజులు, టర్కీలు, మంగోలులు ఈ ప్రాంతాన్ని పాలించారు. క్రీస్తు పూర్వం 1800-800 మధ్య జొరాష్ట్రియనిజం ఇక్కడ ఉదయించి, ప్రచారంలో ఉంది. మౌర్యుల కాలంలో హిందూ, బౌద్ధమతం ప్రాచుర్యం పొందాయి. మధ్యయుగాల్లో ఇస్లాం, మంగోలుల దండయాత్రలు జరిగాయి. మొగలాయిలు ఎక్కువ భూభాగాన్ని, చాలా కాలంపాటు ఆధీనంలో ఉంచుకున్నారు. 1709లో పస్థూన్ తెగకు చెందిన మిర్ హోతక్ అధికారంలోకి వచ్చి ఆయన కొడుకు మిర్ మహ్మద్ హోతక్ పర్షియన్ చక్రవర్తిగా వ్యవహరించాడు. నాదిర్ షా హత్య తర్వాత ఆయన అంగరక్షకుడు అహ్మద్ షా దురానీ 1747లో అధికారాన్ని చేపట్టి తన సామ్రాజ్యాన్ని స్థాపించాడు. రాజధానిని కాందహారు నుంచి కాబూల్‌కు మార్చాడు. 1839-42 మొదటి ఆంగ్లో-అఫ్ఘాన్ యుద్ధంతో ఈ ప్రాంతంపై బ్రిటిష్ ఆధిపత్యం ప్రారంభమైంది. 1919 ఆగస్టు 19న బ్రిటిష్‌పాలన నుంచి స్వాతంత్ర్యం పొందింది. రాజు అమానుల్లా ఖాన్(1919-29) కాలంలో అనేక దేశాలతో సత్సంబంధాలు నెలకొన్నాయి. యూరప్, టర్కీల నుంచి ఆధునికీకరణ, లౌకిక భావాలకు మళ్లేందుకు బీజాలు పడ్డాయి.

## ముఖ్య అధికార మార్పిళ్లు:

రాజు జహీర్ షా కాలంలో రాజ్యాంగాన్ని రూపొందించా రు. రాజకీయ పార్టీలకు అనుమతి లభించింది. ఆయనకు అమెరికాతో సంబంధాలు ఉండేవి. సోవియట్ యూనియన్‌తో స్నేహ ఒప్పందం కారణంగా కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించింది. 1972లో తీవ్ర కరవు కాటకాలు సంభవించాయి. రాజు విదేశీ పర్యటనలో ఉండగా 1973లో ఆయన బంధువు మహమ్మద్ దావూద్ ఖాన్ రక్తపాత రహిత తిరుగుబాటుతో అధికారం చేజిక్కించుకున్నాడు. దేశాన్ని రిపబ్లిక్‌గా ప్రకటించి, అధ్యక్షుడయ్యాడు. పాక్‌కు

వ్యతిరేకంగా వ్యవహరించాడు. ప్రజా సమస్యలపై ఆయనకు పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అఫ్ఘానిస్థాన్ (పీడీపీఏ) పూర్తి సహకారం అందించింది. క్రమేపీ ప్రజా వ్యతిరేకపాలనను సాగించింది. 1978లో పీడీపీఏ ముఖ్య నేత మిర్ అక్బర్ కైబర్‌ను హత్య చేయించడంతో ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. పీడీపీఏ నాయకుడు హఫీజుల్లా అమీన్ నేతృత్వంలో ప్రజలు రాజప్రసాదంపైకి దండెత్తి రాజును హత్యచేశారు. నూర్ మహమ్మద్ తరాకీ ప్రధానమంత్రిగా అధికారం చేపట్టాడు. దేశానికి డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘానిస్థాన్ అని పేరు మార్చారు. ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. మత స్వేచ్ఛ, భూ సంస్కరణలు, రైతుల రుణాల రద్దు, మహిళలకు హక్కు, ప్రభుత్వానికి సెక్యులర్ రూపు ముఖ్యమైనవి. సోవియట్ యూనియన్‌తో ఒప్పందంపై పాక్,ఇరాన్, సౌదీ అరేబియా కన్నెర్రజేశాయి. ఇస్లాంకు ప్రమాదమని ప్రచారం చేశాయి. ప్రచ్ఛన్న యుద్ధ నేపథ్యంలో అమెరికా వీరికి అన్ని రకాల మద్దతునిచ్చింది. ముజాహిద్దీన్‌లను ప్రోత్సహించింది. 1979 మార్చిలో తరాకీని హత్య చేసి హఫీజుల్లా అమీన్ అధికారం చేపట్టాడు. దీనికి వ్యతిరేకంగా.. 1978 ఒప్పందం ప్రకారం సోవియట్.. తరాకీ మద్దతు దారులకు అండగా లక్షమంది సైన్యాన్ని పంపింది. అమీన్‌ను హత్యచేసి బబ్రక్ కర్మాల్ అధికారం అందుకున్నాడు. దీంతో అఫ్ఘాన్‌సమస్య ప్రపంచ అంశంగా మారింది. సోవియట్ యూనియన్ సైన్యాలపై పోరాడేందుకు ముజాహిద్దీన్ గ్రూపులకు అమెరికా, పాక్, ఇతర ముస్లిం దేశాలు మద్దతునిచ్చాయి. 1979–89వరకు సాగిన పోరులో 50వేల మంది పౌరులు మరణించారు. సోవియట్ ఆర్థికంగా, సైనికంగా బాగా నష్టపోయింది. ఈ పరిస్థితుల్లో ఐరాస మధ్యవర్తిత్వంలో ఒప్పందం కుదుర్చుకుని సోవియట్ సైన్యం వెనక్కి వెళ్లింది. ఇది అమెరికాకు నైతిక విజయంగా మారింది. పర్షియన్ గల్ఫ్‌లోని చమురు, సహజవాయువు నిక్షేపాలను కొల్లగొట్టేందుకు అవకాశంగా తీసుకుంది. 1986లో అధికారంలోకి వచ్చిన నజీబుల్లా 1992 ఏప్రిల్‌లో రాజీనామా చేశాడు. దేశం విడిచివెళ్లేందుకు వీలులేకుండా చేశారు. తమ చెప్పుచేతల్లో ఉండే ప్రభుత్వం కోసం అమెరికా, పాక్ కలసి ముజాహిద్దీన్‌ల మధ్య విభేదాలు సృష్టించాయి. ఈలోగా విద్యార్థులను చేరదీసి తాలిబన్లుగా తయారుచేశారు. వారికి ప్రత్యేక సైనిక శిక్షణ ఇచ్చారు. తాలిబన్లు రాజకీయ, మత శక్తులుగా ఎదగడంతో అంతర్యుద్ధం మొదలైంది. 1994లో కాబూల్ రక్తపాతం జరిగింది. 1996లో ఇస్లామిక్ అఫ్ఘానిస్థాన్‌గా తయారుచేసింది. 2000కల్లా పూర్తిగా దేశాన్ని తాలిబన్ల చేతుల్లోకి వెళ్లింది. ఆ తర్వాత సెప్టెంబర్/2001 దాడులు.. అమెరికా జోక్యం తెలిసిందే.

## భారత్‌తో సత్సంబంధాలు

భారత స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ ఇండియాకు చెందిన నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్ (ఎన్‌డబ్ల్యూఎఫ్‌పీ)తో అఫ్ఘాన్ సరిహద్దుగా ఉండేది. దేశ విభజన తర్వాత ఆ ప్రావిన్స్ పాక్‌లో భాగమైంది. అయినా భారత్–అఫ్ఘాన్‌ల మధ్య ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు కొనసాగాయి. భారత సినిమాలు, సంగీతాన్ని అక్కడి వారు ఇష్టపడతారు. ఆ దేశంలో తయారైన కార్పెట్లు, పండ్లు, డ్రై ఫ్రూట్స్‌కు భారత్‌లో మంచి డిమాండు ఉంది. 1980లో డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్ఘానిస్థాన్‌ను గుర్తించిన తొలి దక్షిణాసియా దేశం

భారతే. అయితే తాలిబన్లు కాశ్మీరు భద్రతకు సమస్యగా మారారు. బమియాన్ బుద్ధ విగ్రహాలను ధ్వంసం చేయడంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమాన హైజాక్ వెనుక తాలిబన్లు, ఐఎస్ఐ ప్రమేయం ఉన్నట్లు భారత్ ప్రకటించింది. ప్రస్తుత తరుణంలో.. అఫ్ఘాన్ పునర్నిర్మాణానికి భారత్ తగిన చేయూతనిస్తోంది. 750 మిలియన్ డాలర్ల మేర సాయం అందిస్తోంది. కర్జాయ్ ప్రభుత్వంతో దౌత్య సంబంధాలు నెరపుతోంది. అఫ్ఘాన్ మారుమూల ప్రావిన్స్ నిమ్రోజ్‌లో రోడ్ల నిర్మాణాన్ని కూడా చేపడుతోంది.